క్లుప్తంగా

పాలకులపై ఒత్తిడి పెంచి బీసీ రిజర్వేషన్లు సాధిద్దాం


రిలేదీక్షల్లో పాల్గొన్న నాయకులు

పెద్దపల్లిరూరల్: బీసీ జనాభ కు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచేలా పాలకులపై ఒత్తిడి పెంచి సాధించుకుందామని క్విట్ ఇండియా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ దాసరి ఉష ఆధ్వర్యంలో 41 రోజులుగా సాగుతున్న రిలే దీక్ష శిబిరాన్ని మంగళవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. పార్టీలకతీతంగా బీసీలంతా ఒక్కటై పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. బీసీల హక్కులు, రిజర్వేషన్ల సాధనకు ఐక్య పోరాటాలే శరణ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు సాధిక్, అరుణ, మానస, వరలక్ష్మి, అఖిల, పర్శరాం, నరేశ్, రవి, శ్రీధర్ తదితరులున్నారు.

రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాపంథా నాయకులు

రామగుండం: మార్చి 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజాపంథా రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను మంగళవారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో భగత్‌సింగ్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా ప్రతినిధులు మాట్లాడుతూ భారతదేశంలో మోదీ ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సభ నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, పెండ్యాల శ్రీనివాస్, నారాయణరెడ్డి, కదిరి రాజిరెడ్డి, పుష్పక వెంకన్న తదితరులున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


బ్యాటింగ్ చేస్తున్న కార్పొరేటర్ లత

రామగుండం: పట్టణంలోని జెన్‌కో క్రీడా మైదానంలో మంగళవారం క్రికెట్ పోటీలను స్థానిక కార్పొరేటర్ కౌశిక లత ప్రారంభించి,బ్యాటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు పరస్పర స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేత జట్టుకు రూ.40 వేలు ప్రథమ బహుమతిగా, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.20 వేలు నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. క్రికెట్ పోటీలను ప్రతీ ఒక్కరు తిలకించి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపాలని కోరారు.

అవయవదానానికి అంగన్‌వాడీ టీచర్ అంగీకారం

కోల్‌సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గోదావరిఖనిలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న రావుల శ్రీమాల తన మరణానంతరం నేత్ర, శరీర దేహదానం చేస్తానని అంగీకారం తెలిపి సంతకాలు చేశారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంతో పాటు తన సోదరుడు మరణించిన తేదీ కావడంతో తన మరణానంతరం నేత్ర, అవయవ, శరీరదానం చేస్తానని ప్రకటిస్తూ అంగీకార పత్రాలపై సంతకాలు చేసి సదాశయ ఫౌండేషన్ ప్రతినిధికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు సీడీపీవో పుష్పలత అభినందనపత్రం, డోనర్ కార్డు అందజేశారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు టి.శ్రవణ్‌కుమార్, కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి, ప్రతినిధులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


హోలీ వేడుకల్లో అల్లూరు గ్రామ మహిళలు

హోలీ.. రంగుల కేళీ..

హోలీ వేడుకలు మంగళవారం పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో మహిళలు, పురుషులు, యువకులు, ప్రజాప్రతినిధులు హోలీ వేడుకల్లో పాల్గొని రంగులను చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం, రామగుండం, మంథని నియోజకవర్గ కేంద్రాలు, గోదావరిఖని, సుల్తానాబాద్ పట్టణాలు, అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో హోలీ వేడుకలు సంతోషాలతో నిర్వహించుకున్నారు. చిన్నా, పెద్దా, ఆడ, మగ అనే తేడా లేకుండా అందరూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ డీజే పాటలతో డ్యాన్సులు చేస్తూ సంబరాల్లో మునిగితేలారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మంథనిలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, జెడ్పీ చైర్మన్ పుట్టమధు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. సంబరాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు,చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

\- సాక్షి, నెట్‌వర్క్


జ్యోతినగర్: రంగులు చల్లుకుంటూ చిన్నారుల సందడి


రామగుండం: రైల్వే ఆర్‌ఓహెచ్ షెడ్‌లో రైల్వే కార్మికుల సంబరాలు


వేడుకల్లో సింగరేణి అధికారుల సతీమణులు


హోలీ వేడుకల్లో ఎలిగేడు సర్పంచ్, యువకులు, నాయకులు


ఓదెలలో యువకుల సంబరాలు


సెంటినరీ కాలనీలో హోలీ వేడుకల్లో యువకులు


లక్ష్మీపురంలో టీబీజీకేఎస్ హోలీ సంబరాలు


పెద్దపల్లిలో చిన్నారుల హోలీ సంబరాలు


బీజేపీ నాయకుడు సురేశ్‌రెడ్డి నివాసం వద్ద హోలీ సంబరాలు


ధర్మారంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న కిరాణం అసోసియేషన్ నాయకులు

పంటలకు ఎస్సారెస్పీ నీరు విడుదల


రైతులతో మాట్లాడుతున్న ఎంపీపీ సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ తిరుపతి రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: మండలంలో చివరి భూముల రైతులు తమ పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు.. సాగునీరు విడుదల చేసి, ఆదుకోవాలంటూ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి విన్నవించారు. స్పందించిన ఆయన అధికారులను ఆదేశించడంతో మంగళవారం ఎస్సారెస్పీ డీ–86, డీ–83 కాలువలకు నీటిని విడుదల చేశారు. పంటలకు ఈ నెల 24వ తేదీ వరకు సాగునీరివ్వాలన్నారు. దీంతో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు కాలువల వెంట తిరుగుతూ రైతులతో మాట్లాడారు. కాలువలకు, తూముల వద్ద ఎక్కడైనా మరమ్మతు చేయాల్సి ఉందా అని తెలుసుకున్నారు. నీటి విడుదలతో కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఇదులాపూర్, పందిల్ల, తారుపల్లి, రాయపేట, కిష్టంపేట, చిన్న రాతుపల్లి, పెద్ద రాతుపల్లి, మొట్లపల్లి, కూనారం, మంగపేట గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు వంగళ తిరుపతి రెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ దేవయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక


నారాయణ

రామగిరి: మండలంలోని లద్నాపూర్ గ్రామానికి చెందిన సంఘ సేవకుడు తాల్లపల్లి నారాయణ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికైనట్లు బహుజన సమితి అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 12న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నారాయణకు అవార్డు అందించనున్నట్లు రాధకృష్ణరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

ఆకట్టుకున్న స్టార్ మహిళా పోటీలు

గోదావరిఖని: గోదావరిఖనిలో మంగళవారం నిర్వహించిన స్టార్ మహిళా ట్రోఫీ పోటీలు ఆకట్టుకున్నాయి. ఆర్‌కే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఈ పోటీలను కనుల పండువగా నిర్వహించారు. పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనగా సెమీఫైనల్, ఫైనల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల్లో విజేతలకు జెడ్పీటీసీ సంధ్యారాణి బహుమతులు అందించారు.

ఈఎస్‌ఐ డిస్పెన్సరీ కూల్చివేత


కూల్చకముందు ఈఎస్‌ఐ డిస్పెన్సరీ భవనం

రామగుండం: పట్టణంలో ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈఎస్‌ఐ డిస్పెన్సరీ భవనాన్ని ఇటీవల నేలమట్టం చేయడంతో కార్మికులకు భవనంతో ఉన్న అనుబంధం తెగిపోయింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రామగుండంలో వంద పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం చేపట్టేందుకు స్థానికంగా మరో స్థలాన్ని పరిశీలించినప్పటికీ సదరు స్థలాన్ని ఎంపిక చేసినట్లు మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. ఈ తరుణంలో పాత డిస్పెన్సరీ భవనాన్ని యుద్ధ ప్రాతిపదికన కూల్చి వేసి స్థలాలకు హద్దులు ఏర్పాటు చేస్తుండడంపై అధికారుల హడావుడి చూస్తుంటే ఇక్కడే బహుళ అంతస్తులతో ఆధునిక పరిజ్ఞానంతో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం చేపడతారనే ఆశలు కలుగుతున్నాయి. ఆస్పత్రి నిర్మాణంపై అధికారులు అధికారికంగా ప్రకటించకపోవడంతో ఆస్పత్రి నిర్మాణం చేపడతారా లేదా అని ఆసక్తి నెలకొంది.

24 వరకు ఎస్సారెస్పీ నీటి సరఫరా

• పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గ రైతాంగం సాగు చేసే పంటలకు అవసరమైన సాగునీటిని ఈ నెల 24 దాకా నిరవధికంగా సరఫరా జరుగుతుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. సాగునీరందక పంటలు ఎండిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన పడుతున్న విషయాన్ని ఎస్సారెస్పీ ఉన్నతాధికారులు మురళీధర్‌రావు, వెంకటేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎస్సారెస్పీ డీ–83, డీ–86 కాలువల నుంచి ఈ నెల 24 వరకు సరఫరా చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

రామగుండం: కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్‌లో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ కౌశిక లత ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అవసరమైన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండు తలలు, ఎనిమిది కాళ్లతో మేకపిల్ల జననం



కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మొట్లపల్లిలో సోమవారం రాత్రి పోగుల జనార్దన్ ఇంట్లో ఓ మేక రెండు తలలు, ఎనిమిది కాళ్లతో ఉన్న వింత మేకపిల్లకు జన్మనిచ్చింది. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు తరలివచ్చి, ఆసక్తిగా తిలకిస్తున్నారు. కాగా ఆ మేకపల్లి కొన్ని గంటలే జీవించి, మృతి చెందినట్లు జనార్దన్ తెలిపారు. జన్యులోపమే దీనికి కారణమని పశువైద్యులు పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలే కాంగ్రెస్‌కు బ్రహ్మాస్త్రాలు

• టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేశ్‌రెడ్డి


మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలే కాంగ్రెస్‌కు బ్రహ్మాస్త్రాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేశ్ రెడ్డి అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబ పాలనపై, స్కాంలతో ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న తీరును ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతీ నిరుపేద కుటుంబానికి గతంలో మాదిరిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీ అరచేతిలో వైకుంఠం చూపినట్లు ఉందని విమర్శించారు. ఈ నెల 9న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాజరయ్యే కరీంనగర్ బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, పందిల్ల ఎంపీటీసీ సభ్యుడు రావి సదానందం, పెద్దరాతుపల్లి సర్పంచు కొమురయ్య గౌడ్, పార్టీ మండల కన్వీనర్ మునీర్, ఏఎంసీ డైరెక్టర్ సబ్బని రాజమల్లు, నాయకులు పాల్గొన్నారు.

బహిరంగసభ విజయవంతం చేయాలి

పాలకుర్తి: ఈనెల 9న కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగసభను విజయవంతం చేయాలని పాలకుర్తి మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం బసంత్‌నగర్ మాట్లాడారు. రాహుల్‌గాంధీ జోడోయాత్రకు మద్దతుగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు, టీఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి ప్రజల నుంచి స్పందన వస్తోందన్నారు. కరీంనగర్ బహిరంగసభకు మంథని, రామగుండం నియోజకవర్గాల నుంచి రైతులు, యువకులు, మహిళలు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నాయకులు కోరారు. సమావేశంలో జీడీనగర్ సర్పంచ్ సూర సమ్మయ్య, పాత రవీందర్, ముక్కెర శ్రీనివాస్, తలారీ శంకర్, వేల్పుల రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

కమాన్‌పూర్: మండలంలోని రాంనగర్ లో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను మంగళవారం సర్పంచ్ నీలం సరిత ప్రారంభించారు. రాంనగర్ నుంచి దాసరిపల్లెకు వెళ్లేదారి పూర్తిగా చెడిపోవడంతో రూ. 5 లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్డు వేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఓదెల: గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలతో ఇబ్బందులు దూరమవుతాయని హరిపురం ఉపసర్పంచ్ గ్యారవేని నాగరాజు అన్నారు. మండలంలోని హరిపురంలో రూ. 25 లక్షల వ్యయంతో సీసీరోడ్ల నిర్మాణం పనులను మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలంలో వార్డులు బురదమయం కాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సీసీరోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు ఆసరి మల్లీశ్వరి, పాలకుర్తి సువర్ణ, గ్రామస్థులు కాసారపు ఐలయ్య, గుండేటి శంకర్, మాకొటి ఓదెలు, తుమ్మల సది, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు ఎంపిక


రాంనర్సయ్య

ఓదెల : మండలంలోని నాంసానిపల్లెకు చెందిన అంబేడ్కరిస్టు, సీనియర్ దళిత నాయకుడు నల్లాల రాంనర్సయ్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు–2023కి ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు, అవార్డు సెలెక్షన్ కమిటీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో జరిగే బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ఆయనకు పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. రాంనర్సయ్య అవార్డుకు ఎంపికవడం పట్ల అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి రత్నం, నాస్తికుడు కాసారపు చిన్నఐలయ్యగౌడ్, నాయకులు పల్లె కనకయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వర కల్యాణం

ధర్మారం: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీ వేంకటేశ్వరాలయంలో మంగళవారం స్వామివారి కల్యాణవేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన

ధర్మారం: మండల కేంద్రంలో భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీశ్రీశ్రీ ముక్తానంద స్వామిజీ కరకమలములచే శ్రీ లక్ష్మీనర్సయ్య పంతులు పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం దీపారాధన, గణపతి పూజ, ఆకురారోహణం, సాయంత్రం విగ్రహముల ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పద్మశాలీ సంఘం నాయకులు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.


గోపాల్‌రావుపేటలో స్వామివారి కల్యాణం

కనుల పండువగా శ్రీవేంకటేశ్వర స్వామికి చక్రస్నానం


స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్ లో స్వామి వారికి చక్రస్నానం చేయించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన శ్రీవేంకటేశ్వర స్వామి బహ్మోత్సవాల్లో చివరి రోజు వేదపండితులు మంత్రోచ్ఛారణలతో మహా పూర్ణాహుతి, స్వామి వారికి చక్రస్నానం, మంగళ శాసనము ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ ఎన్వీకే శ్రీనివాస్ దంపతులు, ఏరియా ఆర్జీ–2 జీఎం మనోహర్ దంపతులు, ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వరరావు, రిజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య ఇతర సింగరేణి అధికారులు, భక్తులు పాల్గొన్నారు.